క్లుప్తంగా

సెలవుల్లో డైరీ రాయండి



విద్యార్థినులకు సూచనలు చేస్తున్న ఎంఈఓ బాలభాస్కరరావు

వేపాడ: వేసవి సెలవుల్లో రోజు చేసే పనులు, ఏం చదువుతున్నారనే విషయాలను డైరీలో రాయాలని ఎంఈఓ–2 బాలభాస్కరరావు కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ) విద్యార్థినులకు సూచించారు. మండలంలోని బక్కునాయుడుపేట కేజీబీవీని మంగళవారం ఆయన సందర్శించారు. పాఠశాల పరిసరాలు, కిచెన్, స్టోర్ రూమ్‌లను పరిశీలించారు. 9వ తరగతి నుంచి పదోతరగతి ప్రమోట్ అవుతున్న విద్యార్థినులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట పాఠశాల ఎస్‌ఓ కిరణ్మయి, ఉపాధ్యాయినులు ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ



మల్లివీడు సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్‌ని దొంగిలించి కాపర్‌ను తీసుకుని, అక్కడే పడేసిన మిగతా డొక్కులు

లక్కవరపుకోట: మండలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను దొంగలు ఎత్తుకెళ్లి పోతున్నారు. మల్లివీడు గ్రామ సమీపంలో ఓ ట్రాన్స్‌ఫార్మర్‌ను సోమవారం రాత్రి దొంగలు ఎత్తుకెళ్లి పోయారని విద్యుత్‌శాఖ ఏఈ సీహెచ్.సూరిబాబు మంగళవారం తెలిపారు. తలారి,లక్కవరపుకోట,జమ్మాదేవిపేట గ్రామాల్లో 20 రోజుల వ్యవధిలో మూడు ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురయ్యాయని చెప్పారు. సింగిల్ ఫేజ్ (16 కేవీ సామర్థ్యం)ట్రాన్స్‌ఫార్మర్లను దొంగలు ముందుగా గుర్తించి వాటిని దొంగిలిస్తున్నారని, ట్రాన్స్‌ఫార్మర్లలో ని కాపర్‌ను తీసుకుని మిగతా డొక్కులు అక్కడే వదిలేసి పోతున్నారని చెప్పారు. ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్ విలువ రూ.2 లక్షలపైనే ఉంటుందని పేర్కొన్నారు. ఇటీవల మండలంలో జరిగిన దొంగతనాల్లో రూ.8 లక్షల విలువైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురైనట్లు పోలీసులకు ఏఈ ఫిర్యాదు చేశారు.

స్నాతకోత్సవం



స్నాతకోత్సవంలో చిన్నారులతో ఉపాధ్యాయులు

శృంగవరపుకోట: స్థానిక కౌముది గ్లోబల్ స్కూల్‌లో కిండర్ గార్డెన్ విద్యార్థుల స్నాతకోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు.అతిథిగా హాజరైన పట్టణానికి చెందిన గైనాకాలజిస్ట్ డాక్టర్ అపర్ణ మాట్లాడుతూ కిండర్ గార్డెన్ విద్యార్థులను ప్రాథమిక విద్యకు సమాయత్తం చేయడం కోసం వారికి గ్రాడ్యుయేషన్ డే నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ప్రిన్సిపాల్ శాంతి మహంతి, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ ఒలింపియాడ్‌లో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న డాక్టర్ వరలక్ష్మి

శృంగవరపుకోట: ఇంటర్నేషనల్ సోషల్ స్టడీ ఒలింపియాడ్ ఎగ్జామ్‌లో స్థానిక వరలక్ష్మి స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ఆ స్కూల్ ప్రిన్సిపల్ వై.జానకీ దేవి మంగళవారం తెలిపారు 2024 డిసెంబర్ నెలలో నిర్వహించిన ఇంటర్నేషనల్ సోషల్ ఒలింపియాడ్ మొదటి రౌండ్ పరీక్షలో 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు హాజరు కాగా అందరూ రెండో రౌండ్‌కి ఎంపికయ్యారని, ఆరుగురు విద్యార్థులు గోల్డ్ మెడల్స్ సాధించారని చెప్పారు. విద్యార్థులు ప్రిన్సిపాల్‌తో పాటు పాఠశాల యాజమాన్యం కోలపర్తి రాజేంద్రప్రసాద్, డాక్టర్ వరలక్ష్మి అభినందించారు.

స్వర్ణాంధ్ర విజన్ -2047పై శిక్షణ రేపు

గజపతినగరం: స్వర్ణాంధ్ర విజన్–2047పై స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఉన్న శ్రీకన్వెన్షన్ హాల్‌లో ఈనెల 24వ తేదీన నియోజకవర్గ స్థాయి శిక్షణ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ బి.రత్నకుమార్ మంగళవారం ఓ ప్రకటన లో తెలిపారు. కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఆధ్వర్యంలో నిర్వహించే శిక్షణకు నియోజకవర్గంలోని మండ ల, గ్రామ స్థాయి ఉద్యోగులు, రెవెన్యూ సిబ్బంది హాజరు కావాలని కోరారు.పంచాయతీ ఆర్థిక పురోగతి, ప్రణాళికలు, జీపీఏ, జీడీపీ, పీసీఐ తదితర అంశాలపై శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటలకు అంతా శిక్షణ కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

● వంట గ్యాస్ సిలిండర్‌పై రూ.50 పెంపు
● సామాన్య ప్రజలపై ధరల భారం
● చీపురుపల్లి నియోజకవర్గంలో గ్యాస్ కనెక్షన్లు: 1,23,286
● తాజాగా పెంచిన రూ.50తో రూ.877కు చేరిన గ్యాస్ సిలిండర్ ధర
● వినియోగదారులపై అదనపు భారం: రూ.61,64,300

బాదుడే... బాదుడు



చీపురుపల్లి: కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది తిరగకముందే ప్రజలపై బాదుడు ప్రారంభమయ్యింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ధరలు పెరిగిపోయాయని బాదుడే బాదుడే అంటూ టీడీపీ నాయకులు, అప్పటి ప్రతిపక్షనేత చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు ఊరూరా ప్రచారం చేశారు. తాము అధికారంలోకి వస్తే అన్ని ధరలు తగ్గించేస్తామని, ధరలు పెంచబోమని మాట ఇచ్చారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలపై పగబట్టిన తీరుగా అన్ని ధరలు పెంచేస్తున్నారు. చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చాక సామాన్య ప్రజల నెత్తిన ధరల భారం మోపే కార్యక్రమానికి తెర తీశారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటు రాష్ట్రంలో, అటు కేంద్రంలో కూటమే ప్రభుత్వం ఏర్పాటు చేసింది. నిత్యావసర సరుకులపై ఇష్టారాజ్యంగా ధరలు పెంచుతున్నప్పటికీ ప్రభుత్వ పెద్దలు నోరు మెదపడం లేదన చర్చ సామాన్య ప్రజల్లో జరుగుతోంది. కొద్ది నెలల క్రితమే విద్యుత్ చార్జీలు, వంట నూనె,నిత్యావసర సరుకుల ధరలు పెంచిన సంగతి తెలిసిందే. తాజాగా వంట గ్యాస్ సిలిండర్‌పై ఏకంగా రూ.50 పెంచడంతో పేద ప్రజలపై తీవ్ర స్థాయిలో భారం పడుతోంది.

వినియోగదారులపై మోయలేని భారం

చీపురుపల్లి నియోకవర్గంలోని చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం, గుర్ల మండలాల్లో 1,23,286 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. తాజాగా ప్రభుత్వం ఒక్కో గ్యాస్ సిలిండర్‌పై రూ.50 ధర పెంచడంతో వినియోగదారులపై అదనంగా రూ. 61,64, 300 భారం పడింది. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో పేద, మధ్య తరగతి వర్గాలు ధరల మోయలేక పోతున్నాయి. కష్టపడి కూలిపనులు చేసి సంపాదించిన డబ్బులు నిత్యావసరాలకే సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెంచిన ధరతో తీవ్ర భారం

వంట గ్యాస్ సిలిండర్‌పై ఒకే సారి రూ.50 పెంచడం తీవ్ర భారం కానుంది. ఇప్పటికే గ్యాస్ సిలిండర్ ధర రూ.827 ఉండగా పెంచిన రూ.50తో రూ.877 చెల్లించాల్సి వస్తోంది. ప్రభుత్వం స్పందించి తక్షణమే ధరలు తగ్గించాలి.

– యల్లంటి శివ, వంగపల్లిపేట, చీపురుపల్లి

ధరలు తగ్గించాలి

ఎన్నికల ముందు నిత్యావసర ధరలు పెంచబోమని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. కానీ కూటమి అధికారంలోకి వచ్చిన ఏడాది తిరగకముందే వంట గ్యాస్ సిలిండర్‌పై రూ.50 పెంచింది. పేదలు, సామాన్యులపై తీవ్ర భారం పడనుంది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం గ్యాస్ ధరలు తగ్గించాలి.

– సువ్వాడ శ్రీను, రామాంజనేయకాలనీ, చీపురుపల్లి

● పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



రోజూ పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చని ఐసీడీఎస్ సూపర్ వైజర్ జె.పైడి మంగమ్మ అన్నారు. చీపురుపల్లి మండలంలోని పెదనడిపల్లిలో గ్రామంలో మంగళవారం పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా అంగన్‌వాడీలు పౌష్టికాహార పదార్థాలను ప్రదర్శించారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. చిన్నారుల వెయ్యి రోజుల సంరక్షణ, పిల్లల్లో ఊబకాయం సమస్య తలెత్తకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. శిశు మరణాలు తగ్గించేం దుకు సకాలంలో టీకాలు వేయించాలని సూచించారు.

– చీపురుపల్లి

● వైభవంగా ఆలయ వార్షికోత్సవం



లక్కవరపుకోట మండల కేంద్రంలో కోటమ్మతల్లి ఆలయ వార్షికోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. అర్చకులు ఏ.శ్రీహరిశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళ లతో సామూహిక కుంకుమార్చనలు చేయించారు. సాయంత్రం అమ్మవారి ప్రతిమలను మేళతాళా లతో ఊరేగించారు.

– లక్కవరపుకోట

సందడిగా పాఠశాలల వార్షికోత్సవం



మెరకముడిదాం: చినబంటుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో నృత్యం చేస్తున్న విద్యార్థినులు



బొండపల్లి: కొత్త పనసలుపాడు ప్రాథమిక పాఠశాలలో నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

మెరకముడిదాం: మండలంలోని చినబంటుపల్లి ప్రాథమికోన్నత పాఠశాల వార్షికోత్సవాన్ని హెచ్‌ఎం ఆల్తి రాంబాబు ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు.ఈసందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు అన్నిరంగాల్లో రాణించాలని అన్నారు. అనంతరం విద్యార్థులు నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో సందడి చేశారు. ఉపాధ్యాయులు జి.అప్పలనాయుడు, కె.త్రివేణి, బి.శ్రీదేవి, ఆర్. నారాయణరావు, వి.మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

కొత్తపనసలుపాడులో..

బొండపల్లి: మండలంలోని కొత్త పనసలుపాడు ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవాన్ని హెచ్‌ఎం పూడి మహేష్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నా యి. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గజపతినగరం: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధి గ్రామాలకు బుధవారం ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని బొబ్బిలి విద్యుత్ శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ ఏ.అనంతరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. గజపతినగరం, పురిటిపెంట, గంగచోళ్ల పెంట, కొత్తబగ్గాం, పాతబగ్గాం, పత్రువాడ, సాలిపేట, కొనిశ, మర్రివలస, భూదేవిపేట, బంగారమ్మపేట, వెంకటాపురం, దావాలపేట, బూడిపేట, మధుపాడ, మరుపల్లి, గుడివాడ, ఎం.గుమడాం, పిడిశీల, శ్రీరంగరాజపురం,కాలం రాజుపేట, డోకిపాలెం, సీతారామపురం తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఘనంగా ఆలయ ప్రతిష్ఠోత్సవం



బొండపల్లి: ఎం.కొత్తవలసలో విగ్రహాల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

బొండపల్లి: ఎం.కొత్తవలస గ్రామంలో అయ్యప్పస్వామి ఆలయ ప్రతిష్ఠోత్సవం మంగవారం ఘనంగా నిర్వహించారు.ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి, ఇతర దేవతామూర్తుల విగ్రహాలను ఊరేగించారు. మహిళలు బిందెలు, కలశాలతో నీటిని తీసుకువచ్చి విగ్రహాలకు అభిషేకం చేశారు. అనంత రం వేదపండితులు విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు చేశారు.

నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభం



శృంగవరపుకోట: కొట్టాంలో నవగ్రహ విగ్రహాలకు పూజలు చేస్తున్న పురోహితులు

శృంగవరపుకోట: కొట్టాంలోని ఉమా చోడేశ్వర ఆలయంలో రెండురోజుల పాటు నిర్వహించనున్న నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠో త్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. పురోహితులు తొలి రోజు నవగ్రహ విగ్రహాలకు ధాన్యాదివాసం, జలాదివాసం, తదితర పూజా కార్యక్రమాలు చేశారు. అనంతరం హోమం నిర్వహించారు. బుధవారం విగ్రహాలను ప్రతిష్ఠించిన అనంతరం మధ్యాహ్నం అన్నదానం చేయనున్నట్లు గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

పౌష్టికాహారం తప్పనిసరి



మాట్లాడుతున్న ఎంపీటీసీ చిరంజీవినాయుడు

మెరకముడిదాం: పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే గర్భిణులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని గరుగుబిల్లి ఎంపీటీసీ సీహెచ్.చిరంజీవినాయుడు అన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి ఆధ్వర్యంలో గరుగుబిల్లి గ్రామంలో మంగళవారం పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం ప్రాముఖ్యత, గర్భం దాల్చిన నాటి నుంచి ప్రసవం అనంతరం బిడ్డకు రెండేళ్లు వచ్చే వరకు పోషణ, తల్లిపాల ఆవశ్య కతపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అవగాహన కల్పించారు. బిడ్డకు ఆరు నెలలు వచ్చే వరకు తల్లిపాలు తప్ప మరే ఇతర ద్రావణాలు తాగించకూడదని, 7వ నెల నుంచి అదనపు ఆహారం అందించాలని సూచించారు. సర్పంచ్ ఆవాల అప్పలనాయుడు, సెక్టార్ పరిధి అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వాహన తనిఖీలు

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం రహదారిలో ఎస్‌ఐ జయంతి మంగళవారం వాహన తనిఖీలు నిర్వహించారు. వాహన పత్రాలతో పాటు, వా హన చోదకుల లైసెన్స్‌లు పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్ ధరించాలని, లేకుంటే రూ.1050 జరిమానా విధిస్తామ న్నారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి



గజపతినగరం: గజపతినగరంలోని ఏఎస్‌ఎస్‌ఎమ్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో డిప్యూటీ డీఈఓ మోహన్‌రావు

గజపతినగరం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేలా ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో ప్రచారం చేయాలని డిప్యూటీ డీఈఓ కె.మో హన్‌రావు సూచించారు. మండల కేంద్రంలోని ఏఎస్ఎస్ఎం ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఈసందర్భంగా విద్యార్థుల నోట్ బుక్స్, హా జరు రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని పరీక్షించారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడుతూ ఇంటింట సర్వే చేసి బడి బయట ఉన్న బడి ఈడు పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని అన్నారు. ఆయన వెంట హెచ్‌ఎం అనంతరావు, ఉపాధ్యాయులు గౌరీశంకర్, లోకేశ్వరి, సీఆర్పీ రామసూరిరెడ్డి ఉన్నారు.



వేపాడ: సోంపురంలో వేతనదారులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

గ్రామాల్లో ఉపాధ్యాయుల ప్రచారం

వేపాడ: ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉన్నారని, అన్ని సదుపాయాలతో నాణ్యమైన విద్య అందుతుందని సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బి.పి.ఏ.రాజు అన్నారు. విద్యార్థులను తమ పాఠశాలలో చేర్పించాలని కోరుతూ ఉపాధ్యాయులతో కలిసి సోంపురం,జాకేరు గ్రామాల్లో మంగళవారం ప్రచారం చేశారు. సోంపురంలో ఉపాధి పనులు జరుగుతున్న ప్రాంతానికి వెళ్లి తమ పాఠశాల సాధిస్తున్న ఫలితాలు, స్కూల్లో ఉన్న సదుపాయాలను వేతనదారులకు వివరించి, పిల్లల ను చేర్పించాలని కోరారు. జాకేరులో గ్రామపెద్ద బుద్దా అప్పలనాయుడుతో పాటు అయిదోతరగతి పూర్తవుతున్న విద్యార్థుల తల్లిదండ్రులను కలిశారు. ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, జగన్నాథం సీఆర్పీ ప్రసాద్, మొబైలేజేషన్ ఇన్‌చార్జ్ ఆతవ రవిశంకర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివితే ఉజ్వల భవిష్యత్



చీపురుపల్లి: మెట్టపల్లి హైస్కూల్‌లో విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంఈఓ విజయ్‌కుమార్

చీపురుపల్లి: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే భవిష్యత్ ప్రణాళికలు సిద్ధం చేసుకుని అందుకు అనుగుణంగా కష్టపడి చదువుకోవాలని ఎంఈఓ–2 ఆర్. విజయ్‌కుమార్ అన్నారు. మెట్టపల్లి ఉన్నత పాఠశాలలో ఇంటర్న్‌షిప్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు మంగళవారం సర్టిఫికెట్లు అందజే శారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో వృత్తి శిక్షణ విద్య అభ్యసిస్తున్న విద్యార్థుల కోసం సమగ్ర శిక్ష ఆదేశాలతో ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్ నిర్వహించామని చెప్పారు. హెచ్‌ఎం ఎం.తేజేశ్వరి, వృత్తి శిక్షణ ఉపాధ్యాయులు జె.లిఖిత, బి.మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.



గంట్యాడ: మదనాపురం మోడల్ స్కూల్‌లో సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో ప్రిన్సిపాల్ రామకృష్ణారావు, తదితరులు

మదనాపురం మోడల్ స్కూల్‌లో..

గంట్యాడ: మండలంలోని మదనాపురం మోడల్ స్కూల్‌లో ఒకేషనల్ విద్య అభ్యసించిన విద్యార్థులకు సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్ నిర్వహిం చారు. ఐటీఆర్‌సీ కంపెనీ నిర్వాహణలో పది రోజుల పాటు ఇంటర్న్‌షిప్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు మంగళవారం సర్టిఫి కెట్లు అందజేశారు. ప్రిన్సిపాల్ రామకృష్ణారావు, ఎస్‌బీఐ మేనేజర్ తాటిపూడి బాలాజీ, పంచాయతీ కార్యదర్శి కవిత పాల్గొన్నారు.

దళితుల సాంఘిక బహిష్కరణ అమానుషం



మాట్లాడుతున్న అప్పారావు, దళిత నాయకులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): పిఠాపురం నియోజకవర్గంలోని మల్లాం గ్రామంలో దళితుల సాంఘిక బహిష్కరణ అమాను షం, రాజ్యాంగ విరుద్ధమని సామాజిక న్యాయ ఉద్యమ వేదిక కన్వీనర్ గంటాన అప్పారావు అన్నారు. గరివిడిలో మంగళవారం ఆయన దళిత నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులపై దాడులు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమది ప్రజల ప్రభుత్వమని చెప్పుకునే కూటమి ప్రభుత్వ పెద్దలు పిఠాపురం నియోజకవర్గంలో జరిగిన ఘటనకు సమాధానం చెప్పాలని అన్నారు. దళితులపై ఉద్దేశపూర్వకంగా రాజ్యాంగ విరుద్ధమైన పనులు చేయిస్తున్నట్లు తమకు అనిపిస్తోందన్నారు.దళితులపై దాడులు చేసిన, చేయించిన వారి పతనం తథ్యమని అన్నారు. దళిత నాయకులు బి.సూర్యనారాయణ,టి.సంజీవరావు, తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రీసర్వే



చీపురుపల్లిరూరల్(గరివిడి): ఆవగూడెంలో మ్యాప్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ బంగార్రాజు



వేపాడ: రామస్వామిపేటలో రీసర్వేను పరిశీలిస్తున్న హెచ్‌డీటీ సన్యాసినాయుడుతో మాట్లాడుతున్న చల్లా జగన్

చీపురుపల్లిరూరల్(గరివిడి): భూసమస్యలను పరిష్కరించేందుకే రీసర్వే నిర్వహిస్తున్నట్లు గరివిడి తహసీల్దార్ సీహెచ్.బంగార్రాజు చెప్పారు. ఆవగూడెంలో చేపడుతున్న రీసర్వేను మంగళవారం పరిశీలించారు.రీసర్వే డీటీ డి.శివకుమార్, ఆర్‌ఐ అచ్యుతరావు, వీఆర్‌ఓ జి.కనకమహాలక్ష్మి పాల్గొన్నారు.

వివాదాలకు తావులేకుండా సర్వే చేయాలి

వేపాడ: ఎలాంటి వివాదాలకు తావులేకుండా భూరీసర్వే చేయాలని ఏపీ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ సర్వే సిబ్బందిని కోరారు. రామస్వామిపేటలో మంగళవారం చేపట్టిన రీసర్వేను డీటీ సన్యాసినాయుడు పరిశీలించారు. డీటీని జగన్ కలిసి, రైతుల సమక్షంలోనే సర్వే చేయాలని, రైతుల వివరాలను, భూముల స్థితిని రికార్డుల్లో సక్రమంగా నమోదు చేసేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ బడిని బతికించుకుందాం...



ప్రవేశాలు పొందిన విద్యార్థులతో ఎంఈఓ శ్రీదేవి, తదితరులు

కొత్తవలస: పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చి వాటిని బతికించుకునేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంఈఓ జి.శ్రీదేవి కోరారు. ముమ్మనవానిపాలెం గ్రామ ప్రాథమిక పాఠశాలలో ప్రస్తుతం ఒకే విద్యార్థి ఉన్నాడు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలను మూసివేసే అవకాశం ఉంది. ఈనేపథ్యంలో సర్పంచ్ అల్లం సత్యనారాయణ, గ్రామ పెద్దలు,యువకులు తాజాగా సమావేశమయ్యారు. పాఠశాల మూతపడితే మళ్లీ మంజూరు కావడం కష్టమని భావించి, గ్రామంలోని పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపిం చాలని నిర్ణయం తీసుకున్నారు. దీంతో మంగళవారం ఒకే రోజు పది మంది విద్యార్థులను ఎంఈఓ సమక్షంలో పాఠశాలలో చేర్పించారు.ఈసందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సదుపాయాలతో నాణ్యమైన విద్య అందిస్తున్నామని చెప్పారు.ఆర్ఎంటీ సీహెచ్.నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.